
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
శుక్రవారం 31 అక్టోబరు 2025

విద్యా సంస్థలను కొడంగల్‌లోనే
**ఏర్పాటు చేయాలి**
సీఎంకు పోస్టుకార్డులు పంపిన జేఏసీ నాయకులు
ఎస్పీకి వినతిపత్రం అందజేత 7





# పత్తి రైతు చిత్తు

## భారీ వర్షాలకు దెబ్బతిన్న పంట

**చేనులోనే తడిసి ముద్దయిన పత్తి**

**రైతులను వెంటాడుతున్న కూలీల కొరత**

మొంథా తుపాను రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో మూడు రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పంట చేతి కందే సమయంలో చేనులోనే పత్తి తడిసి ముద్దయింది. నల్లబారి తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో పెట్టుబడి సైతం వచ్చేలా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

8



మర్పల్లిలో చేనులోనే నల్లబారిన పత్తి





విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, అధికారులు

## లక్ష్య సాధనలో వెనుకడుగు వేయొద్దు

దుద్యాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అనుకున్న లక్ష్య సాధనలో వెనుకడుగేయొద్దని ట్రైనీ కలెక్టర్లు హర్ష్‌చౌదరి, చంద్రకిరణ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో విజయరామారావు, తహసీల్దార్ కిషన్‌నాయక్, టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, ఇన్‌చార్జి ఎంపీవో సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, నాయకులు,

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం

మేడ్చల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉన్ని కృష్ణన్, కార్యదర్శి ప్రేమలత ఆరోపించారు. మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామిని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు విజయలక్ష్మీ, మంజుల, జయ, కార్మికులు పాల్గొన్నారు.

# సర్వేకు రైట్ రైట్

## త్వరలో జిల్లాకు లైసెన్స్‌డ్ సర్వేయర్లు

మొదటి విడతలో 67 మందికి లైసెన్స్‌లు

ఆదేశాలు రాగానే మండలాలకు కేటాయింపు

పరిధిని బట్టి ఒక్కో మండలానికి 4 నుంచి ఆరుగురు

రెవెన్యూ శాఖ బలోపేతానికి ప్రభుత్వ నిర్ణయం

త్వరలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు అందుబాటులోకి రానున్నాయి. జిల్లాలో భూ సర్వే ప్రక్రియ వేగం పుంజుకోనుంది. వికారాబాద్ జిల్లాకు 67 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను కేటాయించిన ప్రభుత్వం.. వారి సేవలపై ఇంకా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే వారిని మండలాలకు కేటాయించనున్నారు. అంతే కాకుండా త్వరలో మరికొంత మంది సర్వేయర్లు కూడా అందుబాటులోకి రానున్నారు. వారు కూడా విధుల్లో చేరితే భూ సర్వే ప్రక్రియ వేగవంతం కానుంది.



వికారాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సర్వేయర్ల కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించాలనే నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. జిల్లాకు కేటాయించిన సర్వేయర్లు సర్వేయర్ లైసెన్స్ కోసం నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన తర్వాత శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఆ తర్వాత నిర్వహించిన పరీక్షలోనూ ఉత్తీర్ణులైన సర్వేయర్లకు ప్రభుత్వం లైసెన్సులు జారీ చేసింది. ఈనెల 19వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సర్వేయర్లు లైసెన్సులు తీసుకున్న విషయం తెలిసిందే. జిల్లాకు మొదటి విడతలో 67 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను కేటాయించారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వం సర్వే సమస్యలు పరిష్కరించేందుకు లైసెన్స్‌డ్ సర్వేయర్ల వ్యవస్థకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. పెండింగ్‌లో ఉన్న భూ వివాదాలు, హద్దుల సమస్యలు పరిష్కారం కావడంతో పాటు భూముల విక్రయాలు, కొనుగోళ్ల ప్రక్రియ ఇక పకడ్బందీగా కొనసాగనుంది. భూ సర్వే కోసం యజమానులు దరఖాస్తు చేసుకున్న తర్వాత నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఇక తప్పనుంది.

### రెండు విడతల్లో..

ఇటీవల లైసెన్స్‌డ్ సర్వేయర్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం అర్హుల నుంచి రెండు విడతల్లో

మిగతా 8వ పేజీలో...

జిల్లాలో 20 మండలాలు ఉన్నాయి. ఒక్కో మండలానికి ఇద్దరు సర్వేయర్లు ఉండాల్సి ఉన్నా.. జిల్లా వ్యాప్తంగా 10 మంది ప్రభుత్వ సర్వేయర్లు మాత్రమే పనిచేస్తున్నారు. జిల్లాలో భూ వివాదాలు పెరిగిపోవడం, మండలానికి ఒక సర్వేయర్ కూడా లేకపోవడంతో భూ తగాదాలు వేగంగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. అత్యవసరంగా చేపట్టాల్సిన ప్రభుత్వ, దేవాదాయ, అటవీ శాఖలకు సంబంధించి భూముల హద్దుల గుర్తింపులోనూ జాప్యం చోటు చేసుకుంటుండగా, రైతుల భూ సర్వేల నిర్వహణలోనైతే నెలల తరబడి ఆలస్యం జరుగుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు చెల్లించినా... సర్వేయర్లు దయ తలిస్తేనే సర్వే పనులు ముందుకు సాగే పరిస్థితులు నెలకొన్నాయి. రైతుల భూ సర్వేలకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉండడంతో అధికారులపైనా ఒత్తిడి పెరుగుతోంది.

### సిబ్బంది కొరతతో సేవల్లో జాప్యం



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

## తుపాను బాధితులను ఆదుకోవాలి

**మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్**

మేడ్చల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముఖ్యమంత్రి తన దందాలు.. వసూళ్లను పక్కనబెట్టి తుపాను బాధితులను ఆదుకోవాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం పూడూరు శివారులో గల తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. తుపానుతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, చేతికి రావాల్సిన పంట నీళ్ల పాలైందన్నారు. ఏపీ సీఎం ఎప్పటికప్పుడు సహాయ చర్యలు చేపడుతున్నారని, రైతులతో మాట్లాడి ధైర్యం చెబుతున్నారని, తెలంగాణాలో మాత్రం ప్రభుత్వం నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నదని ఆరోపించారు. పార్టీలన్నీ జూబ్లీహిల్స్ ఎన్నికలను పక్కన పెట్టి సహాయక చర్యల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డబ్బులు అడిగితే కాలేజీల మీద విజిలెన్స్ దాడులతో ఉక్కుపాదం మోపాలని చూస్తున్నారని ఆరోపించారు. తగిన సమయంలో ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారాన్నరు. వేల కోట్లు వృథా చేసిన కేసీఆర్‌ను ఎలా బొంద పెట్టారో చూశామని, రేవంత్‌రెడ్డికి అధికారం శాశ్వతం కాదన్నారు. సమావేశంలో నాయకులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, బోడా శ్రీనివాస్, అమరం మోహన్‌రెడ్డి, సూర్య, తదితరులు పాల్గొన్నారు.

## రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

**ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అక్బర్**



వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

వికారాబాద్/పరిగి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ రూ.8,150 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, విద్యార్థుల సమస్యలపై స్పందించకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్ ఆరోపించారు. గురువారం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వికారాబాద్ జిల్లాలో విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దసరా, దీపావళి నాటికి నిధులు విడుదల చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ విడుదల చేయలేదన్నారు. ర్యాలీలు నిర్వహించిన విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేయడం సరైంది కాదన్నారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేదరని, బకాయిలు విడుదల లేయకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తేజ, రాకేష్, సిద్ధు, రేహాన్, జునేద్, అఖిల్, షిర్యాజ్, రాజు, ఇస్మాయిల్, దీపక్, చందు తదితరులు పాల్గొన్నారు.

### విద్యా సంస్థల బంద్, ర్యాలీ

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్పులు, ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పరిగిలో విద్యా సంస్థల బంద్ చేపట్టారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాకలి అనిల్ మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్పులు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు ఏళ్లుగా చెల్లించడం లేదని ఆరోపించారు. కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నాయని, సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్, శివ, రియాజ్, రేహాన్, సోయిన్, సమీర్, సాహిద్, వంశి పాల్గొన్నారు.

## పల్లెల్లో మౌలిక సదుపాయాలు

**అదనపు కలెక్టర్ సుధీర్**

పరిగి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనపై కార్యదర్శులు శ్రద్ధ చూపాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. గురువారం పరిగి మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, వీధిలైట్ల ఏర్పాటుపై చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పనులపై పర్యవేక్షణ ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో హరిప్రియ, ఎంపీవో కరీం, డీఈఈ సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు

**తాండూరులో డ్రోన్ల కలకలంపై నిఘా**

**వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి**



భూమిపూజ చేస్తున్న వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

తాండూరు రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టామని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం తాండూరు మండలంలోని కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో బెల్కటూర్ శివారులోని అదానీ సిమెంట్ కర్మాగారం సహకారంతో రూ.10 లక్షల సీఎస్ఆర్ నిధులతో రెండు అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ సైబర్ నేరాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పెద్దేముల్ మండలం ఆడ్కిచర్ల, తట్టేపల్లి, నాగులపల్లితో పాటు తాండూరు మండలంలోని ఉద్దాండపూర్, జినగుర్తి, సంకిరెడ్డిపల్లి తదితర ప్రాంతాల్లో రాత్రి వేళలో డ్రోన్ల సంచారంపై నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. అవి డ్రోన్లు కావని, భూమి నుంచి 20 వేల ఫీట్ల ఎత్తు(సుమారు ఆరు కిలోమీటర్ల)లో సంచరిస్తున్న చిన్న విమానాలని పరిశీలనలో తేలిందని పేర్కొన్నారు. వాటిపై నిఘా ఉంచామని, ప్రజలు ఆందోళన చెందొద్దని సూచించారు. తాండూరు ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. తాండూరు, వికారాబాద్, పరిగిలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. అనంతరం ఎస్పీని అదానీ సంస్థ హెచ్ఆర్ నాగార్జున శాలువాతో సన్మానించారు. తాండూరులో ట్రాఫిక్‌పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ నగేష్, ఎస్ఐ రాథోడ్ వినోద్‌కుమార్, తదితరులు ఉన్నారు.

# బ్రిడ్జిపై నెలల తరబడి బారికేడ్లు



తాండూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తాండూరు-కొడంగల్ రోడ్డు లోని కాగ్నా నది బ్రిడ్జిపై పడిన భారీ రంధ్రాన్ని జూలైలో ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ పూడ్చివేశారు. అయితే మరమ్మతుల సమయంలో పెట్టిన బారికేడ్లను అధికారులు ఇప్పటికీ తీయలేదు. దీంతో తాండూరు-కొడంగల్ జాతీయ రహదారిపై వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ఇరుకై ఇక్కట్లు తలెత్తుతున్నాయి. దీనిపై అధికారులు స్పందించాల్సి ఉంది.



# చోరీ సొత్తు కొంత రికవరీ

- 2022లో ఐసీఎల్ కర్మాగార క్వార్టర్స్‌లో 65 తులాల బంగారం అపహరణ
- కోర్టు ద్వారా 23 తులాల అప్పగింత
- దర్యాప్తు కొనసాగుతోందన్న ఎస్పీ



ఐసీఎల్ కర్మాగారంలో దొంగతనం జరిగిన ఇంటి వద్ద మీడియాతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ రషీద్(ఫైల్)

తాండూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం మల్కాపూర్ ఇండియా సిమెంటు కర్మాగారంలోని ఐసీఎల్ క్వార్టర్స్‌లో 2022 డిసెంబర్ 29న జరిగిన భారీ చోరీ కేసులో పోలీసులు కొంత పురోగతి సాధించారు. అప్పట్లో కర్మగార సెక్యూరిటీ అధికారిగా పనిచేసిన చంద్రశేఖర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి విధులు నిర్వహిస్తుండగా అర్ధరాత్రి ఇంట్లో 65తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై అప్పటి అడిషనల్ ఎస్పీ రషీద్ విచారణ జరిపారు. కేసును పరిశీలించారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబం ప్రొద్దుటూర్‌లో ఉంటోంది. చోరీ జరిగిన మూడేళ్ల తర్వాత పోలీసులు పురోగతి సాధించారు. అంతర్రాష్ట్ర ముఠా చోరీ చేసినట్లు క్రైమ్‌పోలీసులు గుర్తించారు. మధ్యప్రదేశ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో క్రైమ్ టీమ్ దర్యాప్తు జరిపి మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక నిందితుడిని పట్టుకొని అతడి నుంచి 23తులాల బంగారాన్ని రికవరీ చేశారు. మరి కొందరు నిందితులు ఇతర రాష్ట్రాల్లో ఉన్నందున క్రైమ్ టీమ్ ఆయా రాష్ట్రాలకు వెళ్లి నిందితులను పట్టుకునే ప్రయత్నం చేస్తోంది. రికవరీ చేసిన 23తులాల బంగారాన్ని కోర్టు ద్వారా చంద్రశేఖర్‌రెడ్డికి అప్పగించినట్లు జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆంధ్రజ్యోతితో తెలిపారు. బంగారాన్ని పూర్తిస్థాయిలో రికవరీ చేసేందుకు క్రైమ్ టీం గుజరాత్‌కు వెళ్తున్నట్లు వెల్లడించారు. అప్పట్లో సంచలనం రేపిన ఈ చోరీ కేసుపై పోలీసులు సవాల్‌గా స్వీకరించి నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నాలు చేశారు. ఈ కేసు విషయమై గురువారం జిల్లా ఎస్పీ కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో స్థానిక పోలీసులతో సమీక్షించారు. తాండూరులో ఇటీవల జరిగిన రెండు చోరీలతో పాటు పెద్దేముల్ మండలం కందనెల్లిలో జరిగిన దొంగతనంపై పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. చోరీల్లో దొంగలు తమ ఫింగర్స్ ప్రింట్లు దొరకకుండా, సీసీ కెమెరాలకు చిక్కకుండా జాగ్రత్తగా వ్యవహరించారు. అందరు నిందితులను పట్టుకునేందుకు జిల్లా పోలీసులు వివిధ రాష్ట్రాలకు తరచూ వెళ్లివస్తూనే ఉన్నారు.

# పేదలను ఆదుకునేందుకే ఇందిరమ్మ ఇళ్లు



'ఇందిరమ్మ' గృహ ప్రవేశంలో వజ్రేశ్‌యాదవ్, నాయకులు

శామీర్‌పేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని నిరుపేదలను ఆదుకునేందుకే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ పథకంతో ఇండ్లు కట్టిస్తోందని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ అన్నారు. అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని తుర్కపల్లికి ముఖ్య అతిథిగా వజ్రేశ్‌యాదవ్ వచ్చి మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలుయాదవ్, హౌసింగ్ డీఈ అశోక్, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌లతో కలసి లబ్ధిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ గృహ ప్రవేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకొనేందుకు ఒక్కో ఇంటికి రూ.5లక్షలను అందజేస్తోందని వివరించారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, పేదల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎ-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి, ఆర్టీఏ జిల్లా సభ్యుడు భీమిడి జైపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేశ్, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేశ్, సీనియర్ నాయకుడు తున్కి భిక్షపతి, మున్సిపల్ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మైల్వార్‌ను సందర్శించిన డీఎల్పీవో



డీఎల్‌పీవోకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, గ్రామస్తులు

బషీరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మైల్వార్ గ్రామాన్ని తాండూరు డీఎల్‌పీవో ప్రవీణ్‌కుమార్ గురువారం సందర్శించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. అనంతరం 235 సర్వే నంబర్‌లో కొంత భూమి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆక్రమించారనే ఫిర్యాదుపై కార్యదర్శి నర్సింహగౌడ్‌ను అడిగి ఆరా తీశారు. డీఎల్‌పీవో అక్కడికి వెళ్లి పరిశీలించారు. గ్రామస్తులతో సమావేశమై విచారించారు. ఇందులో కార్యదర్శి ప్రమేయం లేదని నాయకులు, ప్రజలు రాత డీఎల్‌పీవోకు రాతపూర్వకంగా తెలిపారు. డీఎల్‌పీవోతో ఎంపీవో జయకర్ ఉన్నారు.

## నగరేశ్వరాలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం



పూజలు నిర్వహిస్తున్న పూజారులు

తాండూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తాండూరు వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం నగరేశ్వర స్వామి ఆలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పరమేశ్వరుడి తరుపున సింగంశెట్టి శోభ-పద్మనాభం, పార్వతీదేవి తరుపున కొత్రిక నాగలక్ష్మి-శ్రీకాంత్ దంపతులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న కల్యాణ వేడుకలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఉదయం నుంచి నగరేశ్వర ఆలయంలో దేవతా విగ్రహాలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, వినోద్ పాల్గొన్నారు.



పార్వతీపరమేశ్వరుల కల్యాణంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

## మాజీ ఎమ్మెల్యేను కలిసిన చైర్మన్లు




నారాయణరావుతో సమావేశమైన ఏఎంసీ, సొసైటీ చైర్మన్లు, నాయకులు

బషీరాబాద్,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ ఏఎంసీ, సొసైటీ చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే ఎం.నారాయణరావును గురువారం బషీరాబాద్‌లోని నివాసంలో కలిశారు. మాజీ ఎమ్మెల్యే నాయకులతో స్థానిక రాజకీయాలపై చర్చించినట్లు సమాచారం. రానున్న స్థానిక ఎన్నికల దృష్ట్యా పలు అంశలపై ఆరా తీసినట్లు తెలిసింది. మాజీ ఎమ్మెల్యేను కలిసిన వారిలోఏఎంసీ, సొసైటీ చైర్మన్లు జి.మాధవరెడ్డి, ఎ.వెంకట్‌రాంరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సాయిల్‌గౌడ్ ఉన్నారు.

## అనురాగ్ హెచ్‌వోడీకి జాతీయ స్థాయి అవార్డు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఆర్టిఫిషయల్ ఇంటలిజెన్స్ హెచ్‌వోడీ మల్లికార్జున్‌రెడ్డికి భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్-2025 అవార్డు వచ్చింది. ఆర్టిఫిషయల్ ఇంటలిజెన్స్(ఏఐ)లో మల్లికార్జున్‌రెడ్డి అసాధారణ నాయకత్వం, విద్యా ప్రతిభ, నూతన ఆవిష్కరణల ఆధారిత బోధన, ప్రభావంతపరిశోధనల పట్ల ఆయన చేసిన కృషిని గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేశారు. భారత ఎడ్యుడకేషన్ ఎక్సలెన్స్ జాతీయస్థాయి అవార్డును ఎంఎల్లార్ కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి, జేఎన్టీయూ వైస్ చాన్సలర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్, ఎఐసీటీఈ ప్రతినిధి చంద్రశేఖర్, టీసీఎస్ ప్రతినిధి బాలప్రసాద్ మల్లికార్జున్‌రెడ్డిని శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మల్లికార్జున్‌రెడ్డికి ఎక్స్‌లెన్స్ అవార్డును అందజేస్తున్న వీసీ ప్రసాద్

## టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన



టీబీపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మేఘన

కోట్‌పల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కోట్‌పల్లి డాక్టర్ మేఘన తెలియజేశారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా గురువారం ఇందోల్ పంచాయతీ కార్యాలయం వద్ద టీబీ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రక్తపోటు, ఓల్డ్ టీబీ, మధుమేహం, ఆల్కహాల్, ధూమపానం ఉన్న వారికి స్క్రీనింగ్ చేసి టీబీ లక్షణాలుంటే ఎక్స్‌రే, కంటి పరీక్ష చేయించామన్నారు. వ్యాధి ఉంటే 6 నెలల వరకు ఉచిత మందులు, నెలకు రూ.వెయ్యి ఆర్థిక సాయం ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఖయ్యూం, ల్యాబ్ టెక్నీషియన్ నర్సింలు, ఎమ్ఎల్ఎచ్‌పీ దివ్య, ఏఎన్ఎమ్ అపర్ణ, అశోక్, రాజేందర్, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, ఆశాలు పాల్గొన్నారు.


## బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి

షాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర హాకీ ఫెడరేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్, కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. షాబాద్‌లో అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీసీ రిజర్వేన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షకు వారు మద్దతు తెలిపారు. దీక్షలు గురువారంతో 19వ రోజుకు చేరాయి. దీక్షలో వీరశైవ లింగాయత్ సంఘం నాయకులు మల్లికార్జున్, నవీన్, రాజేష్, విశ్వనాథం పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. దేశ జనాభాలో సగం బీసీలు ఉన్నారని, వారికి రిజర్వేషన్లు న్యాయబద్ధమైనవే అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు రిలే నిరాహార దీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు రాజేందర్‌గౌడ్, వెంకట్, రవీందర్, రమేశ్, నర్సింహులు, అశోక్, చెన్నయ్య, రాము, రాజు, సత్యనారాయణ, రాములు, మల్లేష్, వెంకటయ్య పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో రాష్ట్ర హాకీ ఫెడరేషన్ చైర్మన్ విజయ్‌కుమార్

## అన్ని దానాల్లో అన్నదానం గొప్పది



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. అవుశాపూర్‌లోని తన నివాసంలో తత్వమసి సేవా సమాజం ఆధ్వర్యంలో శబరిమలలో ఏర్పాటు చేసే అన్నప్రసాద వితరణ కార్యక్రమ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. తత్వమసి సేవా సమాజం సభ్యులను అభినంచాడు. కార్యక్రమంలో సమాజం సభ్యులు మురళి, జైహింద్‌గౌడ్, చంద్రం, నాగరాజు, శంకర్, వెంకటేష్, దర్శన్ ఉన్నారు.


సీఎంకు రాసిన పోస్టుకార్డులను చూపుతున్న జేఏసీ నాయకులు, ప్రజలు

## విద్యా సంస్థలను కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలి

**» సీఎంకు పోస్టుకార్డులు రాసి జేఏసీ నిరసన**

కొడంగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాల, సమీకృత గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలించకుండా కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలని కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ కో-కన్వీనర్లు ఎరన్‌పల్లి శ్రీనివాస్, మాసాని వెంకటయ్య కోరారు. గురువారం జేఏసీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన కార్డులను పోస్టుబాక్సుల్లో వేశారు. వారు మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనకబడిన కొడంగల్ ప్రాంతంలో విద్యాసంస్థలను ఏర్పాటు చేసి అభివృద్ధికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో పవన్‌కుమార్ లాహోటి, బస్వరాజ్, పకీరప్ప, చిన్నయ్య, నవీన్‌సింగ్, మదన్, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

### నిరాహార దీక్షలకు అనుమతివ్వాలని ఎస్పీకి వినతి

మెడికల్ కాలేజీ, గురుకులాలను కొడంగల్‌లోనే ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 1 నుంచి కొడంగల్‌లో నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు. నిరాహార దీక్షకు అనుమతివ్వాలని కోరుతూ గురువారం జిల్లా కేంద్రంలో ఎస్పీ నారాయణరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు జి.సురేశ్‌కుమార్, శ్రీనివాస్, రమేశ్ బాబు, భీమరాజు, సూర్యనాయక్, డాక్టర్ నవాజ్ పాల్గొన్నారు. అలాగే పరిగి డీఎస్పీ శ్రీనివాస్‌కు సైతం వినతిపత్రం ఇచ్చామని తెలిపారు.

## పెండింగ్ పీఆర్సీని వెంటనే చెల్లించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి

రాజేంద్రనగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): 2023 జూలై నుంచి ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని, లేకుంటే డిసెంబరు 9 తర్వాత కార్యాచరణకు దిగుతామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ టీచర్స్ యూనియన్(పీఆర్‌టీయు టీఎస్) రంగారెడ్డి జిల్లా సర్వసభ్య సమావేశాన్ని బుధవారం కాటేదాన్‌లో నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.కృష్ణారెడ్డి, గౌరవాధ్యక్షుడు పి.రాఘవేందర్‌ల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు టెట్ నిబంధనను తొలగించాలన్నారు. పెండింగ్ బిల్లులన్నీ వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు భిక్షంగౌడ్, బి.జగన్ మోహన్‌గుప్తా, పి.వెంకటరెడ్డి, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, రామేశ్వర్‌గౌడ్, సుశీల, కరుణ, పద్మ, సుదర్శన్, శ్రీనివాస్‌సాగర్, మాణిక్యంరెడ్డి, శ్రీనివాస్, గోవర్ధన్‌యాదవ్ పాల్గొన్నారు.

## న్యాయవాదులకు ఉచిత బ్యాంక్ ఖాతాలు


మాట్లాడుతున్న పీఎన్బీ మేనేజర్ కనకదాస్

వికారాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల కోసం ప్రత్యేకంగా ఉచిత కరెంట్ అకౌంట్ సదుపాయం కల్పిస్తున్నామని పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ కనకదాస్ తెలిపారు. గురువారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆధ్వర్యంలో వికారాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదులకు ఉచిత కరెంట్ అకౌంట్లు అందజేసి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. అకౌంట్ ఓపెన్ చేసిన వారికి చెక్‌బుక్, ఏటీఎం కార్డు, క్యూఆర్ కోడ్ ఉచితంగా ఇస్తామని, అదనంగా లాకర్ సదుపాయం, గృహరుణం వంటి సేవలు కూడా అందిస్తామన్నారు. ఈ ఖాతాలకు మినిమమ్ బ్యాలెన్స్ అవసరం లేదని, ఎటువంటి చార్జీలు విధించమని, న్యాయవాదులకు క్యూఆర్‌కోడ్ స్వైప్ మిషన్లను కూడా ఉచితంగా ఇస్తామని తెలిపారు. ఇప్పటి వరకు వికారాబాద్‌లో 45మంది న్యాయవాదులు ఖాతాలు తెరిచారని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్, ఉపాధ్యక్షుడు శంకరయ్య, కార్యదర్శి వెంకట్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ సురేష్, శిరీష, న్యాయవాదులు లవకుమార్, కమాల్‌రెడ్డి, యాదవరెడ్డి, నాగరాజు, రాంచందర్‌రావు, శుక్లవర్ధన్‌రెడ్డి, రఫీ,డి.లక్ష్మణ్, అశోక్‌కుమార్, ఖయ్యూం, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## రాకేశ్ కిషోర్‌ను అరెస్ట్ చేయాలి

తలకొండపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సీజేఐ బీఆర్.గవాయ్‌పై దాడిచేసిన న్యాయవాది రాకేశ్‌కిషోర్‌ను అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. మండల పరిధి వెల్జాలలో గురువారం నిరసన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు తుడుం శ్రీను ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నవంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించే 'హలో దళిత్-చలో హైదరాబాద్' కార్యక్రమ విజయవంతంపై చర్చించారు.

### ఆమనగల్లులో సన్నాహక సమావేశం

ఆమనగల్లు: సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి తరలిరావాలని ఎమ్మార్పీఎస్ ఆమనగల్లు మండలాధ్యక్షుడు శ్రీశైలం కోరారు. పట్టణంలో సన్నాహక సమావేశం నిర్వహించారు.

## విమాన ప్రయాణికుడికి తీవ్ర అస్వస్థత

**● అపోలో ఆసుపత్రికి తరలింపు ..**

శంషాబాద్ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఆదె రవి అనే ప్రయాణికుడు 6ఈ1407 అబుదాబికి వెళ్లేందుకు గురువారం విమానం ఎక్కాడు. విమానం టేకాఫ్ సమయంలో ఊపిరాడటం లేదని సిబ్బందికి తెలిపాడు. దీంతో విమానాన్ని తిరిగి 26ఏ గేటు వద్దకు తీసుకెళ్లి ప్రయాణికుడిని దింపి ఏఎంసీ సిబ్బందికి అప్పగించారు. రవిని అపోలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రవి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వ్యక్తి అదృశ్యం

**● 400 డాలర్లు ఇస్తేనే విడిచిపెడతామని దుండగుల ఫోన్**

శంషాబాద్ రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):థాయిలాండ్‌కు వెళ్తున్న ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ కనకయ్య తెలిపిన వివరాల మేరకు.. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్‌నకు చెందిన మధును ఈ నెల 16న అతడి సోదరుడు పరశురామ్ ఎయిర్‌పోర్టులో వదిలిపెట్టాడు. 22న వరకు ఫోన్‌లో అందుబాటులో ఉన్న మధు అనంతరం అందుబాటులోకి రాలేదు. విదేశాల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి 'మీ అన్న డ్రగ్స్ కేసులో పట్టుబడ్డాడు. 400 డాలర్లు ఇస్తేనే వదుల్తాం.' అని చెప్పారని కుటుంబ సభ్యులను డిమాండ్ చేశారు. దీంతో గురువారం పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కనకయ్య తెలిపారు.

# ముంచిన బంతి

**కిలో రూ.10 కూడా పలకని ధర**

**కూలి, రవాణా ఖర్చుల భారం**

**పూలను కోసేందుకు ఇష్టపడని రైతులు**

కందుకూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బంతి తోటలు సాగుచేసిన రైతులకు ఈ సంవత్సరం నష్టం వచ్చింది. కొత్తగూడ, కందుకూరు, నేదునూరు, జైత్వారం, కొత్తూరు తదితర గ్రామాల్లో 50ఎకరాల్లో రైతులు బంతి తోటలు వేశారు. గతేడాది దీపావళికి కిలో 80రూపాయల వరకు పలికిన ధర ఈసారి పడిపోయింది. రైతులు ఆశించిన ధర రాక నష్టాలపాలయ్యారు. దీపావళి పండుగ మూడురోజుల పాటు కిలో రూ.60 నుంచి 70 వరకు ధర ఉంది. పండుగ ముగిసినా కార్తీక మాసంలో బంతిపూలకు ధర ఉంటుందని రైతులు భావించారు. అయితే ఇప్పుడు కిలో బంతి ధర రూ.10కి పడిపోయింది.



### తుఫాన్‌తో మరిన్ని ఇబ్బందులు

అక్టోబరు నెలలో వరుసగా తుఫాన్ వర్షాలతో బంతిపూలను మార్కెట్‌కు తరలించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్‌లోని గుడిమల్కాపురం మార్కెట్‌కు బంతిపూలు తరలించినా గిట్టుబాటు ధర రావడం లేదు. కిలోకు పది రూపాయలైనా రావడం లేదని రైతులు వాపోతున్నారు. కొన్నిసార్లు అమ్ముడుపోక మార్కెట్‌లో పారబోసి వస్తున్నారు. పూలు తెంపేందుకు, మార్కెట్ రవాణాకయ్యే ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు.


జైత్వారంలో బంతి తోట



### గతంలో ఇలాంటి పరిస్థితి లేదు

నేను పదేళ్లుగా బంతి, చామంతి తోటలు సాగుచేస్తున్నా. బంతికి ఎప్పుడైనా కిలోకు రూ.20పైనే ఉండేది. ఈ సంవత్సరం బంతికి ధర లేక కూలీల, రవాణ ఖర్చులైనా రావడం లేదు. దీంతో తెంపకుండా వదిలేస్తున్నా. ఇలాంటి దుర్భర పరిస్థితి నేను ఎప్పుడూ చూడలేదు. ప్రభుత్వం పూలు, కూరగాయ రైతులకు మద్దతు ధరొచ్చేలా చర్యలు తీసుకోవాలి.

**- సింగిరెడ్డి నర్సింహారెడ్డి, పూల రైతు, కొత్తగూడ**

# ఇంట్లోనే నిర్ధారణ పరీక్షలు

## అందుబాటులోకి .. ఆధునిక వైద్య పరికరాలు

**» త్వరితగతిన వ్యాధి నిర్ధారణ**

**» టెక్నాలజీతో తగ్గుతున్న వైద్య ఖర్చులు**

**» సమయం, డబ్బు ఆదా**

చేవెళ్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆధునిక వైద్య విజ్ఞానం అందుబాటులోకి రావడంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోంది. బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు రోజూ పరీక్షలు అవసరం. వాటి నిర్ధారణకు క్లినిక్‌లకు పరుగులు తీసే పని లేకుండా ఇంట్లోనే పరీక్షించుకునే వైద్య పరికరాలు లభ్యం అవుతున్నాయి. చేవెళ్ల డివిజన్‌లోని అన్ని మండలాల్లో ఈ పరికరాలను విస్తృతంగా వాడుతున్నారు. స్థానిక మెడికల్ షాపుల్లోనూ అమ్ముతున్నారు. నిమిషాల వ్యవధిలోనే వ్యాధి నిర్ధారణ జరుగుతోంది. రోగులు ఆస్పత్రులకు పరుగులు తీసే బాధ తప్పింది. సమయం, డబ్బు ఆదా అవుతాయి. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగి ప్రతీ చిన్నదానికి ఆస్పత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలకు పరుగులు తీయకుండా ఇంట్లోనే వైద్య పరీక్షలు చేసుకుంటున్నారు.




### షుగర్ వ్యాధిగ్రస్తుల కోసం ..

మధుమేహ వ్యాధిగ్రస్తులు రోజూ రక్తంలో షుగర్ శాతాన్ని తెలుసుకుంటూ రక్తంలో గ్లూకోజ్ స్థాయిని అదుపులో పెట్టుకోవాలి. లేదంటే షుగర్ లెవల్స్ పెరిగి గుండె, కిడ్నీ, కళ్లు తదితర శరీర అవయవాలు పాడయ్యే ప్రమాదం ఉంది. ఇప్పుడు గ్లూకోమీటర్ మార్కెట్‌లో లభిస్తోంది. దీనితో సెకన్ల వ్యవధిలోనే రక్తంలో షుగర్ లెవల్స్ తెలుసుకోవచ్చు. సూది గుచ్చుకున్నంత నొప్పి మాత్రమే ఉంటుంది. ఎక్కువ రక్తం తీయకుండా ఒక్క రక్తం చుక్కతో షుగర్ లెవెల్స్ తెలుసుకోవచ్చు.

### ఎలక్ట్రానిక్ బీపీ మీటర్లు

రోజురోజుకూ బీపీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. రక్తపోటు తెలుసుకుని దాని నియంత్రణకు మందులు వాడాలి. బీపీ నిర్ధారణకు ఆస్పత్రికి వెళ్లే పనిలేకుండా ఇంట్లోనే పరీక్ష చేసుకునేందుకు ఎలక్ట్రానిక్ బీపీ మిషన్‌తో రక్తపోటు, గుండె కొట్టుకునే రేటు తెలుస్తాయి. ఈ విధానంలో కచ్చితత్వం కూడా ఎక్కువే!

### గర్భ నిర్ధారణ పరీక్ష

గర్భం వచ్చిందా.. లేదా? అని నిర్ధారణ చేసే పరీక్షను ఇళ్ల వద్దనే చేసుకోవచ్చు. వన్ స్టెప్ ప్రెగ్నెన్సీ టెస్ట్ డివైస్ ద్వారా ఈ పరీక్ష సులువుగా చేస్కోవచ్చు. మహిళ యూరిన్ ఒకచుక్క స్ట్రిప్‌పై వేస్తే దానిపై ఒక్క ఎర్రగీత కనిపిస్తే గర్భం రానట్టు. ఎర్ర గీతలు రెండు కనిపిస్తే గర్భం దాల్చినట్టు లెక్క.



### ఆస్తమా రోగుల సౌకర్యార్థం..

చలికాలంలో ఆస్తమా రోగులను సమస్య తీవ్రంగా వేధిస్తుంది. దమ్ముతో పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడతారు. ఈ వ్యాధి ఉన్న వారికి రాత్రి నిద్రపోయేందుకు ఇబ్బంది ఉంటుంది. అలాంటి సమయాల్లో ఆస్పత్రులకు వెళ్లకుండా ఇంట్లోనే ఊపిరితిత్తుల్లో ఉన్న ఇన్ఫెక్షన్‌ను తగ్గించేందుకు నెబిలైజర్ అనే వైద్య పరికరం ఉపయోగపడుతోంది.

### నడవలేని వారికి...

పక్షవాతం వచ్చి నడవలేక మంచానికే పరిమితమయ్యే వారికి, ప్రమాదాల్లో వెన్నుపూస దెబ్బతిన్న వారిని మల,మూత్ర విసర్జనకు తీసుకెళ్లేందుకు కుటుంబసభ్యులు ఇబ్బంది పడతారు. వారి సమస్యలు తీర్చేలా ఆధునిక వీల్‌చైర్లు వచ్చాయి. వీటిల్లో మల, మూత్రాలను పట్టేందుకు కింద భాగంలో చిన్న బకెట్/బేసిన్లు అమర్చుతారు. వాటిని వినియోగించిన తరువాత శుభ్రం చేసి మళ్లీ అమర్చొచ్చు. మడత కుర్చీలపై పండుకున్నట్టు నడుము వాల్చేలా వీల్‌చైర్లు ఉన్నాయి. 150కిలోల బరువు ఉన్న వారు సైతం వీటిపై కూర్చునేలా ధృడంగా తయారు చేశారు.



### వైద్యుల పర్యవేక్షణ తప్పనిసరి



బీపీ, షుగర్ వంటి జబ్బులకు ఆధునిక వైద్యపరికరాలు అందుబాటులోకి రావడం మంచిదే. రోగులు రోజూ ఈ పరీక్షలు చేయించుకోవాలి కాబట్టి ఇంటి వద్దే రిపోర్ట్ తెలుసుకునే అవకాశం ఉంది. ఆధునిక వైద్య పరికరాలతో ప్రజలకు ప్రయోజనం కలుగుతోంది. ఇళ్ల వద్దే కొన్ని వైద్య పరీక్షలు సొంతంగా చేసుకొని మందులు తీసుకోడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. అయితే దీర్ఘకాలిక రోగులు అప్పుడప్పుడు వైద్యులను సంప్రదించి వారి పర్యవేక్షణలో మందులు వాడాలి.

**- డాక్టర్ రాజేంద్రప్రసాద్, సూపరింటెండెంట్, చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రి**

### ఆరోగ్యంపై అవగాహన పెరిగింది



డిజిటల్ బీపీ ఆపరేటర్లు, షుగర్ పరీక్షలు చేసుకునే గ్లూకో మీటర్లు రావడంతో ప్రజల్లో వ్యాధులపై అవగాహన పెరిగింది. బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తరుచూ పరీక్షలు చేయించుకోవాలి. గతంలో వైద్య పరికరాలు లేక, ప్రజల్లో అవగాహన అంతగా లేక ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ డిజిటల్ వైద్య పరికరాలను కొంటున్నారు. చాలా మంది బీపీ, షుగర్ మిషన్లతో ఇంట్లోనే చెక్ చేసుకుంటూ వాటిని అదుపులో పెట్టుకుంటూ ఇబ్బందులు రాకుండా చూసుకుంటున్నారు.

**- డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, ఆర్థోపెడిక్ వైద్యుడు, చేవెళ్ల**

# బీటీ వేయరూ?

## రెండేళ్లుగా రోడ్డు కోసం ఎదురుచూపులు

**» కంకర పోసి వదిలేసిన కాంట్రాక్టర్**

**» అయోధ్యనగర్ కాలనీ వాసుల ఇక్కట్లు**

తాండూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం పోలీస్ స్టేషన్ నుంచి సాయిపూర్ తాతాగుడి మీదుగా హైదరాబాద్ రోడ్డుకు కలిపే సీసీ, బీటీ రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిచాయి. రెండేళ్ల క్రితం రూ.3కోట్ల నిధులు మంజూరు కాగా 3కి.మీ రోడ్డు వేయాల్సి ఉంది. పోలీస్‌స్టేషన్ నుంచి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ వరకు రూ.కోటి వ్యయంతో సీసీ రోడ్డు వేశారు. కృష్ణవేణి స్కూల్ నుంచి సాయిపూర్ హనుమాన్ ఆలయం వరకు సీసీ రోడ్డు వేయాల్సి ఉంది. అక్కడి నుంచి తాతగుడి మీదుగా కట్టమైసమ్మ ఆలయం నుంచి అయోధ్యనగర్ కాలనీల మధ్య హైదరాబాద్ రోడ్డును కలుపుతూ రూ.2కోట్ల మేరకు బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. రెండేళ్ల క్రితం ఆ రోడ్డు మార్గంలో కంకర, దానిపై ఎర్రమట్టి వేసి వదిలేశారు. కాంట్రాక్టర్ బీటీ రోడ్డు వేయలేదు. దీంతో కాలనీ రోడ్లపై పెద గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులకు, కాలనీ వాసులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. రోడ్డు పనులు పూర్తయితే సాయిపూర్ మీదుగా బైపాస్‌లో హైదరాబాద్ రోడ్డు పెట్రోల్ బంక్ వరకు ట్రాఫిక్ సమస్య లేకుండా వెళ్లొచ్చు. ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు చేయడంలేదు. ఇప్పటికైనా పనులు పూర్తిచేసి రోడ్డును అందుబాటులోకి తేవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


తాండూరు-సాయిపూర్ అయోధ్యనగర్ కాలనీలో బీటీ వేయకుండా వదిలేసిన రోడ్డు

# అన్నదాతలు అధైర్యపడొద్దు

**» పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది**

**» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి భరోసా**


మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దని, వారిని ప్రభుత్వం ఆదుకుంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి భరోసా ఇచ్చారు. కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు, కల్వకుర్తి, వెల్దండ మండలాల్లో గురువారం ఎమ్మెల్యే పర్యటించారు. మొంథా తుపాన్ వల్ల గ్రామాల్లో దెబ్బతిన్న పత్తి, వరి పంటలను పరిశీలించారు. రంగుమారిన పత్తిని ప్రభుత్వం కొని తమను ఆదుకోవాలని రైతులు కోరారు. రైతులు ఆందోళన చెందొద్దని, నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరిహారం ఇచ్చి ఆదుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు. తడిసిన పత్తి కొనుగోలు చేసేలా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకుపోతానన్నారు. వ్యవసాయశాఖ అధికారులు పంటనష్టాలపై వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రోడ్లు, చెరువుకుంటల మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. చెరువు కుంటల్లోకి వరద వస్తున్నందున ప్రమాదాలు జరగకుండా నిఘా ఏర్పాటు చేయాలని నారాయణరెడ్డి సూచించారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, పీసీసీ మెంబర్ ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, జగన్, బిచ్యానాయక్, సీనియర్ నాయకులు కాసు శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, భూపతిరెడ్డి, ఆనంద్, శ్రీకాంత్‌రెడ్డి, పర్వత రెడ్డి, మోతీలాల్, అజీజ్,వెంకటేశ్‌రెడ్డి, అంబాజీ పాల్గొన్నారు.

### మద్దతు ధర కల్పించేందుకే కొనుగోలు కేంద్రాలు

తలకొండపల్లి: పంట ఉత్పత్తులకు మద్దతు ధర ఇచ్చేందుకే కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. రైతులు వాటిల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. గురువారం పడకల్‌లో ప్యాక్స్ ఆధ్వర్యంలో మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.2,400 ధర ఇస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, ఏడీఏ శోభారాణి, ఏవో రేణుకచక్రవర్తి, ప్యాక్స్ సీఈవో ప్రతాప్ రెడ్డి, నాయకులు శ్రీశైలం, జగ్గారెడ్డి, రమాదేవి పాల్గొన్నారు.

## ఘనంగా దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

శంకర్‌పల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కొండాకల్‌లో నూతనంగా నిర్మించిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి, బీరప్ప, కొండపోచమ్మ ఆలయాల్లో దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గోపూజ, ఆలయ ముఖ మండపం, గణపతి పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, యాగశాల సంస్కారం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర హోమం తదితర పూజలను వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. గ్రామస్తులు పెద్దఎత్తున పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**అవసరాలకు అనుగుణంగా ...**

## టూలింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లు

**» జీఎంఆర్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్‌తో ఆర్‌హెచ్ ఏరో సంస్థ వ్యూహాత్మక భాగస్వామ్యం**



శంషాబాద్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జీఎంఆర్ ఏవియేషన్, ఆర్‌హెచ్ ఏరో సంస్థతో వ్యూహాత్మక భాగస్వామ్యంతో విమాన మెయింటెనెన్స్, ఇంజనీరింగ్‌లో ప్రతిష్ఠాత్మక కేంద్రంగా నిలుస్తుందని జీఎంఆర్ ఏరో టెక్నిక్ అధ్యక్షుడు అశోక్ గోపినాథ్ అన్నారు. జీఎంఆర్ ఏరో టెక్నిక్ భారత్‌లో ప్రవేశించిందన్నారు. దేశంలో ప్రముఖ ఎయిర్ ఫ్రేమ్ మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ సంస్థగా గుర్తింపు పొందిన ఆర్‌హెచ్ ఏరో ప్రపంచ వ్యాప్తంగా ఏఈఎం లైసెన్స్‌డ్ టూలింగ్, గ్రౌండ్ సపోర్ట్ ఎక్విప్మెంట్, లైవ్ సైకిల్ సేవల్లో అగ్రగామిగా ఉందన్నారు. ఈ భాగస్వామ్యంతో రెండు సంస్థలు ఆర్‌హెచ్‌ఏరో, ఏరోస్పేస్ రంగాల అవసరాలకు అనుగుణంగా టూలింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లను జీఎంఆర్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్ ద్వారా నిర్వహిస్తామన్నారు. నైపుణ్యాభివృద్ధి వైమానికరంగ వికాసానికి, మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి కీలకంగా ఉంటాయని తెలిపారు.

## నిషా ముక్త్ భారత్‌గా తయారు చేయాలి


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్

కేశంపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నిషా ముక్త్ భారత్‌ను తయారు చేయాలని కేశంపేట ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ సూచించారు. పాపిరెడ్డిగూడ ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో డ్రగ్ కల్చర్ పెరగడం ఆందోళనకరమన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడుతున్నట్లు తెలుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట చేలల్లో గంజాయి సాగుచేస్తున్న సంఘటనలు చూస్తున్నామని తెలిపారు. ఎవరైనా అనుమానస్పద వస్తువును విక్రయిస్తే వెంటనే ఉపాధ్యాయులకు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దివ్యాసింగ్, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం శ్రీశైలం, టీచర్లు కె.గోపాల్‌రెడ్డి, సూర్యకాంత్, సువర్ణ, శ్రీదేవి, శ్రీశైలం, లావణ్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# పత్తి రైతు చిత్తు

● వర్షాలతో తగ్గనున్న దిగుబడి ● వేధిస్తున్న కూలీల కొరత ● ఆందోళనలో రైతులు


గొట్టిగఖుర్దు శివారులో అరకొరగా పత్తి దిగుబడి

బషీరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పత్తిసాగు చేసిన రైతులకు ఏ మాత్రం కలిసిరాలేదు. ప్రారంభంలో ఆశాజనకంగా ఉన్న పత్తిసాగు ఆ తర్వాత వర్షాల కారణంగా ఎదుగుదల నిలిచిపోయి పూత, కాత నేలరాలింది. పంట చేతికొచ్చే సమయంలో 40శాతం పత్తికాయలు మురిగిపోయాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరకొరగా కాత కాసినప్పటికీ పత్తి సరిగా విచ్చుకోకపోవడంతో దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడంలేదని ఆందోళన చెందుతున్నారు. బషీరాబాద్ మండలంలో ఈసారి 14వేల ఎకరాల్లో పత్తి సాగుచేశారు. ఎకరాకు రూ.20వేల నుంచి 30వేల వరకు పెట్టుబడులు పెట్టారు. నల్ల రేగడి నెలల్లో ఈసారి ఎకరాకు కనీసం 7, 8 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందనుకున్న రైతుల అంచనాలు తలకిందులయ్యాయి. ప్రస్తుత పరిస్థితుల్లో నల్లరేగడి భూముల్లో ఎకరాకు 3, 4 క్వింటాళ్ల పత్తి వచ్చేలా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

### నల్లబారుతున్న తెల్లబంగారం

పెద్దేముల్: తెల్లబంగారం కాస్త నల్లబారుతోంది. అధికవర్షాలు, తుఫాను వర్షాలకు పత్తి పంటలు కోలుకోలేని దెబ్బతింటున్నాయి. మండలంలో రైతులు కంది, పత్తి పంటలను పెద్దఎత్తున సాగుచేశారు. వర్షాధారంగా పంటలు సాగుచేసుకునే రైతులకు ఏటా వర్షాకాలం పంటలు పెద్దగా లాభాలు ఇవ్వడం లేదు. వర్షాలకు పంటమొత్తం నల్లబారి విత్తనాలు మొలకెత్తే అవకాశం కనిపిస్తోంది. నల్లబారిన పత్తిని వ్యాపారులు కొనుగోలు చేయడానికి ముందుకు రావడంలేదని రైతులు చెబుతున్నారు. దీంతో పెట్టుబడులు సైతం రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. వరి రైతులకు కూడా నష్టాలు కలిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. తుపాను ప్రభావంతో చాలాచోట్ల పంటలు నేలవాలాయి.


పెద్దేముల్: పత్తితడిసి పోయి కిందకు తీగలావాలిపోతున్న పంటను చూపిస్తున్న రైతు

### విక్రయానికి తప్పని ఇక్కట్లు

మార్కెట్లో విక్రయానికి తీసుకొచ్చిన పత్తిని తేమ, నాణ్యత పేరుతో ప్రైవేటు వ్యాపారులు వంకలు పెడుతూ తక్కువ ధరకు కొంటున్నారని రైతులు వాపోతున్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం గత్యంతరం లేక ఇచ్చిన ధరకే అమ్ముకుంటున్నామని చెబుతున్నారు. క్వింటాలుకు రూ.7వేల నుంచి 7,100 వరకు కొంటున్నారని, ప్రభుత్వ మద్దతు ధరతో పోల్చితే చాలా తక్కువేనని రైతులు ఆవేదన చెందుతున్నారు. సీసీఐ మద్దతు ధర 8,110 ఉందని, కేంద్రాన్ని ప్రారంభించిన కొనుగోళ్లు మొదలుకాలేదని రైతులు పేర్కొంటున్నారు.


బేకుల్‌కోడ్ తండాలో పత్తిని ఆరబెడుతున్న మహిళ

### పత్తి తీతకు కూలీల కొరత

కొడంగల్ రూరల్: ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి వచ్చే సమయానికి వరుణుడి దోబూచులాటతో ఆందోళనలో ఉన్న రైతులను కూలీల కొరత వేధిస్తోంది. మొదట్లో మొలకలు సరిగా రాలేదు. తర్వాత ఎడతెరిపి లేని వానలకు పంట ఎర్రబారిపోయింది. ఇక చివరకు ఉన్న కొద్దిపాటి పంట చేతికి వచ్చినా పత్తి తీతకు కూలీలు లేక అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో కిలో రూ.12చొప్పున పత్తి తీయడానికీ కూలీలు ముందుకు రావడంలేదని రైతులు వాపోతున్నారు.

### ఆరబెట్టేందుకు తిప్పలు

వరుస వర్షాలతో పత్తి పంట పొలంలోనే తడిసి ముద్ద కావడంతో రైతులు పొలంలో పత్తిని ఆరబెట్టేందుకు తిప్పలు పడుతున్నారు. గతంలో రైతులు పత్తి పంట చేతికి రాగానే కూలీలతో తీయించి పొలం నుంచి ఇంటికి తీసుకొచ్చి నిల్వ ఉంచి కొనుగోలు కేంద్రాలకు తరలించేవారు.

#### పెట్టుబడి కూడా రాదు



పత్తిపంటకు పెట్టుబడులు చాలానే పెట్టాం. పంట మొదట్లో ఏపుగా పెరిగింది. అధికవర్షాలు కురిసి కాయలు సగం రాలిపోయాయి. మిగిలిన పంటైనా చేతికి వస్తుందని ఆశించాం. కాని తుపానుతో చేతికి వచ్చిన పత్తికూడా తడిసి నేలరాలిపోతోంది. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. **- తిమ్మగళ్ళ బాలయ్య, రైతు, మంబాపూర్, పెద్దేముల్ మండలం**

#### వర్షాలు నట్టేట ముంచాయి



సొంత పొలంలో 14 ఎకరాల పత్తిసాగు చేశాను. ప్రారంభంలో బాగానే ఉన్నా భారీ వర్షాలతో పంట దెబ్బతిన్నది. పూత, కాత రాలిపోయి నష్టపోయా. ఎకరానికి నాలుగు క్వింటాళ్ల పత్తి కూడా వచ్చే అవకాశం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి. **- విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు, గొట్టిగఖుర్దు, బషీరాబాద్**

## తుపానుతో తీరని నష్టం

**మర్పల్లి:** మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు పత్తి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. గత రెండు రోజులుగా కురిసిన అకాల వర్షానికి పత్తి పంట పూర్తిగా దెబ్బతిందని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మర్పల్లి మండలంలో దాదాపు 4వేల ఎకరాలకుపైగా పత్తిని రైతులు సాగు చేయగా వర్షానికి పూర్తిగా నష్టపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పత్తి వర్షాలకు దెబ్బతినడంతో ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు.

**కులకచర్ల:** తుపాను ప్రభావంతో మండలంలో రైతులు సాగు చేసిన పంటలకు తీరని నష్టం వాటిల్లింది. కులకచర్లకు చెందిన బండి అనంతయ్యకు ఉన్న రెండు ఎకరాల్లో వరి పంట సాగు చేశాడు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పొలంలో నీరు చేరి నేలపాలైంది. నష్టపోయిన పంటలను సర్వే చేయిస్తున్నామని వ్యవసాయ అధికారి వీరస్వామి తెలిపారు

**యాలాల:** మండల పరిధిలోని రాస్నం గ్రామంలో రామకృష్ణారెడ్డి అనే రైతు నాలుగు ఎకరాల్లో సన్నరకం వరి పంటను సాగు చేశాడు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలతో వరిపంట పూర్తిగా నేలకొరిగి పాడైపోయింది. వేలల్లో ఖర్చుపెట్టి వరిపంట సాగుచేస్తే అకాలవర్షాల కారణంగా పంట పాడైపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. సంబంధిత అధికారులు స్పందించి పంట నష్టపరిహారం అందే విధంగా చూడాలని బాధిత రైతు కోరుతున్నాడు.


కులకచర్లలో నీట మునిగిన వరి పంట


యాలాల: రాస్నంలో వర్షాలకు నేలకొరిగిన వరి

# వంతెన తెగి.. పెళ్లికి అడ్డంకి

● మరమ్మతులు చేయించిన పెళ్లికూతురి తండ్రి

ధారూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో భారీవర్షానికి వంతెనపై పోసిన మట్టి కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. కూతురు పెళ్లికి వంతెన అడ్డంగా మారింది. దీంతో ఆ తండ్రి వంతెన మరమ్మతులు చేయించాడు. ఈ ఘటన మండలంలోని రుద్రారం-నాగసమందర్ గ్రామాల మధ్య గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నాగసమందర్ గ్రామానికి చెందిన కె.వీరేశం కూతురు వివాహం గురువారం వికారాబాద్ పట్టణంలో ఏర్పాటు చేశారు. కాగా గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు రుద్రారం-నాగసమందర్ గ్రామాల మధ్య వంతెన పైనుంచి కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగునీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో వంతెనపై పోసిన మట్టి కొట్టుకుపోయి నాగసమందర్ నుంచి వికారాబాద్‌కు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో కూతురు పెళ్లికి వికారాబాద్‌కు వెళ్లాలంటే నాగసమందర్ నుంచి మంబాపూర్ మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి. మరో మార్గం కనిపించకపోవడంతో తండ్రి కె.వీరేశం తన స్వంత ఖర్చులతో దెబ్బతిన్న వంతెనపై మట్టి పోయించి తాత్కాలికంగా మరమ్మతులు చేయించాడు. దీంతో వాహనాల రాకపోకలు సాఫీగా కొనసాగాయి. గ్రామానికి రాకపోకలకు సౌకర్యంగా మారుతుందనే ఆలోచనతోనే వంతెనపై మట్టిపోయించానని వీరేశం తెలిపాడు. కాగా మండలంలో కురిసిన భారీ వర్షాలతో కలిగిన ఇబ్బందులను అధికార యంత్రాగం పట్టించుకోవడంలేదనే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.


రుద్రారం-నాగసమందర్ గ్రామాల మధ్య తెగిన వంతెనకు మరమ్మతులు

# సర్వేకు రైట్ రైట్

(ఐదో పేజీ తరువాయి)

దరఖాస్తులు స్వీకరించింది. మొదటి విడతలో 121 మంది దరఖాస్తు చేసుకోగా, శిక్షణ పూర్తి చేసుకొని ఆ తర్వాత నిర్వహించిన పరీక్ష ఉత్తీర్ణులైన లైసెన్సుడ్ సర్వేయర్లకు దీపావళి పండగకు ముందు రోజు సీఎం చేతులమీదుగా అనుమతి( లైసెన్సులు) పత్రాలు అందజేశారు. జిల్లాకు 67 మంది లైసెన్సుడ్ సర్వేయర్లను కేటాయించారు. అయితే వారికి ఇంకా మండలాల కేటాయింపు జరగలేదు. ఇదిలా ఉంటే, రెండో విడతలో దరఖాస్తులు ఆహ్వానించగా, 128 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 107 మంది మాత్రమే రిపోర్ట్ చేశారు. ఈనెల 26న నిర్వహించిన లైసెన్సుడ్ సర్వేయర్ల పరీక్షకు 106 మంది శిక్షణ పొందిన అభ్యర్థులతోపాటు 35 మంది సప్లిమెంటరీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి లైసెన్స్‌లు అందజేయనున్నారు. వీరు కూడా అందుబాటులోకి వస్తే జిల్లాలో సర్వేయర్ల సమస్య చాలావరకు పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ఒక్కో మండలానికి నలుగురు నుంచి ఆరుగురిని కేటాయించనున్నట్లు తెలుస్తోంది.

### సర్వే ఆధారంగానే గౌరవం


లైసెన్సుడ్ సర్వేయర్లకు ప్రభుత్వం ఎలాంటి వేతనం ప్రకటించలేదు. కేవలం వారు చేసిన భూముల సర్వే ఆధారంగానే మూడు విడతల్లో వారి ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి. తహసీల్దార్ కార్యాలయాల్లో భూమి రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో స్లాట్ బుకింగ్‌లోనే సర్వేయర్ వివరాలు కూడా నమోదు కానున్నాయి. లైసెన్సుడ్ సర్వేయర్ భూమిని సర్వే చేసి హద్దులు నిర్ధారించి రెగ్యులర్ సర్వేయర్‌కు నివేదిక అందజేయాల్సి ఉంటుంది. ఆ తర్వాతే తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కానున్నట్లు చెబుతున్నారు. రెండు ఎకరాల్లోపు భూమి సర్వే చేస్తే వెయ్యి రూపాయలు ఇవ్వనున్నారు. రెండు నుంచి ఐదెకరాల వరకు సర్వే చేస్తే రూ.2 వేలు, ఐదు నుంచి పదెకరాల వరకు సర్వే చేస్తే రూ.5 వేలు, పదెకరాలకు పైగా ఉంటే రూ.5 వేలు చెల్లించనున్నారు. ఈ డబ్బులు కూడా లైసెన్సుడ్ సర్వేయర్లకు మూడు విడతల్లో చెల్లించనున్నారు. ఫీల్డ్ విజిట్‌కు 30 శాతం, మ్యాప్ తయారీ తర్వాత 30 శాతం, సర్వేయర్‌కు నివేదిక ఇచ్చిన తర్వాత 35 శాతం చెల్లించనుండగా, ఐదు శాతం సర్వే శాఖకు జమ కానున్నట్లు చెబుతున్నారు.

## అవినీతి రహిత సమాజస్థాపనకు కృషిచేయాలి


మాట్లాడుతున్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజస్థాపనకు ప్రతీఒక్కరు కృషిచేయాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఘట్‌కేసర్ బ్రాంచీ మేనేజర్ చంద్ర శేఖర్ తెలిపారు. అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షే గురుకుల డిగ్రీ (బుద్వేల్) కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన జాతీయ విజిలెన్స్ వారోత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 'జాగరుకత మన సమిష్టి బాధ్యత' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శారద, బ్యాంక్ అధికారులు సత్యవాణి, ఉదయశ్రీ, అజేష్‌కుమార్, రాము పాల్గొన్నారు.

## యాలాల జెడ్పీహెచ్ఎస్‌లో ఏక్తాదివస్


మాట్లాడుతున్న యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి

యాలాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం ఏక్తాదివస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు యాలాల ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. భారత దేశ ప్రథమ హోంశాఖ మంత్రిగా పనిచేసిన దివంగత సర్దార్ వల్లాభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని పోలీసుశాఖ తరపున విద్యార్థులతో కలిసి పటేల్‌ను స్మరించుకున్నారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. దేశ ఐక్యతను, సమగ్రతను స్మరించుకోవడమే ఏక్తా దివాస్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సిద్ధరామేశ్వర్, ఉపాధ్యాయులు వెంకట ప్రసాద్, భాను చైతన్య, మంగళ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మిస్తున్నారని ఫిర్యాదు

కులకచర్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించి రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. బండవెల్కిచర్లలో సర్వే నంబర్ 543లో రెండు ఎకరాల 7గుంటల భూమిని ఓ రైతు ప్రభుత్వానికి 1989లో విక్రయించాడు. ఇట్టి భూమిలో ఇల్లు లేని వారికి కేటాయించగా వందకు పైగా ఇళ్లు నిర్మించుకున్నారు. పక్కన పొలమున్న రైతు కాలనీకి వచ్చే రోడ్డుకు అడ్డంగా స్థలం మాదంటూ గోడ నిర్మిస్తున్నాడన్నారు. సర్వే చేసి చర్యలు తీసుకోవాలని ఆందోళన చేపట్టారు.

# ఉపఎన్నిక ప్రచారంలో ఎమ్మెల్యేలు


ఎన్నికల ప్రచారంలో ఓ హోటల్‌లో దోశలు వేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా వెంగల్‌రావు నగర్ డివిజన్ యాదగిరి నగర్‌లో గురువారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. హోటల్ నిర్వహిస్తున్న ఓటర్ వద్దకు వెళ్లి దోశలు వేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ రవిగౌడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మురళి గౌడ్, కాంగ్రెస్ నాయకులు ఉప్పరి మల్లేశం, అమీర్, కిరణ్, తదితరులు ఉన్నారు.

**కులకచర్ల:** కాంగ్రెస్ మండల నాయకులు జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో బిజీ అయ్యారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఇంటింటి ప్రచారంలో పాల్గొంటున్నారు. గురువారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లో మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్‌తో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపుకు ప్రచారం నిర్వహించారు.


జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఇంటింటి ప్రచారంలో కులకచర్ల కాంగ్రెస్ నాయకులు

## 'ఉమ్మీద్'లో వక్ఫ్ భూముల వివరాలు అప్‌లోడ్

వికారాబాద్: నవంబర్ 10వ తేదీ నుంచి వికారాబాద్ జమా మసీద్‌లో ఉమ్మీద్ పోర్టల్ లో వక్ఫ్ భూముల వివరాలు నమోదు ప్రారంభం కానుందని మసీద్‌కమిటీ అధ్యక్షుడు గులాం కలీముద్దీన్ తెలిపారు. రామయ్యగూడ మసీదు అక్సాలో బుధవారం జరిగిన సమావేశంలో వికారాబాద్ మసీద్ పెద్దలు చర్చించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉమ్మీద్ పోర్టల్‌లో వికారాబాద్ జిల్లాకు చెందిన వక్ఫ్ భూములు, మసీదులు, దర్గాలు, గ్రేవియార్డులు, అషూర్‌ఖానాలు, ఇతర ముస్లిం సమాజానికి సంబంధించిన ఆస్తుల వివరాలను అప్‌లోడ్ చేయాలని నిర్ణయించారన్నారు. ఈ కార్యక్రమంలో ఫక్రుద్దీన్, ఆదం, మోసిన్, అలీమ్, ఖలీమ్ ఖురేషి పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

#### వృద్ధులకు వీల్‌చైర్లు పంపిణీ

బొంరాస్‌పేట్: బురాన్‌పూర్‌లో గురువారం యూత్ ఫర్ సేవా సంస్థ సహకారంతో గ్రామంలోని నిరుపేద వృద్ధులకు మూడు వీల్ చైర్లను పంపిణీ చేశారు. ఓయూ విద్యార్థి నర్సింహగౌడ్ మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకునేందుకు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మేరాజ్, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, గ్రామస్థులు వెంకటయ్యగౌడ్, బందెప్ప గౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

#### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

దోమ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఎంపీడీవో గ్యామానాయక్ అన్నారు. మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.

#### పాఠశాలల వివరాలు నమోదు చేయించాలి

పరిగి: పాఠశాలలకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని యుడైస్‌లో నమోదు చేయాలని పరిగి ఎంఈవో గోపాల్ సూచించారు. పరిగిలో గురువారం జరిగిన అన్ని పాఠశాలల హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల భవనాల కండిషన్, టాయిలెట్స్, నీటి వసతి, తదితర వివరాలతో ఫార్మాట్ ప్రకారం నమోదు చేయించాలన్నారు. విద్యార్థుల హాజరును ప్రతీ రోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మధ్యాహ్నభోజనం వివరాలను బోర్డుపై ఉంచాలన్నారు. ఈ సమావేశంలో రిసోర్స్‌పర్సన్ లక్ష్మయ్య, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

#### అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

దుద్యాల్: అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సీఐటీయూ జిల్లా నాయకుడు బుస్స చంద్రయ్య అన్నారు. గురువారం ఆయన విలేకరులతో విద్యార్థుల ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ధర్నాకు వెళ్లకుండా గురువారం ముందస్తుగా పోలీసులు బుస్స చంద్రయ్యను అరెస్టు చేశారు. ఇప్పటికైనా విద్యార్థుల పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను విడుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

## ప్రారంభానికి సిద్ధంగా గ్రంథాలయం



బొంరాస్‌పేట్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రేగడిమైలారంలో నూతన గ్రంథాలయం ప్రారంభానికి సిద్ధమైనట్లు మండల గ్రంథాలయ శాఖ లైబ్రరియన్ అర్షద్ తెలిపారు. గ్రంథాలయంలో గురువారం ఫర్నీచర్, పుస్తకాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, నాయకులు చంద్రప్ప, శ్రీనివాస్, గోవర్ధన్, వెంకటేశ్, శ్రీశైలం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



నవాబుపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చిట్టిగిద్ద గ్రామంలో దత్తాత్రేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, నాభిశిల బొడ్రాయి పునప్రతిష్ఠాపన కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు.

## క్రైం కార్నర్

### కల్వర్టును ఢీకొన్న బైక్.. వ్యక్తి మృతి

● అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా ప్రమాదం
● మరొకరికి తీవ్ర గాయాలు


అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

బషీరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అంత్యక్రియలకు హాజరై బైక్‌పై తిరిగి వస్తుండగా కల్వర్టును ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన బషీరాబాద్-తాండూరు ప్రధాన రోడ్డులో కొర్విచెడ్ కల్వర్టు వద్ద గురువారం రాత్రి జరిగింది. మండలంలోని వాల్యానాయక్ తండాకు చెంది బాల్యానాయక్(53), నంద్యానాయక్ తండాకు చెందిన తుల్జనాయక్‌లు కలిసి యాలాల మండలంలోని రేళ్ల గడ్డ తండాలో బంధువు మృతి చెందగా అంత్యక్రియలకు వెళ్లారు. సాయంత్రం స్వగ్రామాలకు తిరిగి వస్తుండగా మార్గమధ్యలో కొర్విచెడ్ వద్ద కల్వర్టుకు వాహనంతో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బాల్యానాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. తుల్జనాయక్ కాలు విరగడంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. స్థానిక ఎస్ఐ నుమాన్‌అలీ, సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని విచారణ జరిపి వివరాలు నమోదు చేసుకుని వెళ్లారు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

### డ్రంకెన్ డ్రైవ్ కేసులో 38 మందికి జరిమానా

బషీరాబాద్/యాలాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో 38 మందికి కోర్టు జరిమానా విధించినట్లు రూరల్ సీఐ వైనగేశ్ తెలిపారు. తాండూరు నియోజక వర్గంలోని బషీరాబాద్, కరణ్‌కోట్, పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 38మందిని గురువారం తాండూరు మెజిస్ట్రేట్‌లో హాజరుపరిచారు. న్యాయాధికారి హర్షచౌదరి, ఐఏఎస్, అసిస్టెంట్ కలెక్టర్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌లు వారికి రూ.66,500జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. కరన్‌కోట్ పోలీసుస్టేషన్ పరిధిలో 12మందికి రూ.20వేలు, యాలాల పోలీసుస్టేషన్ పరిధిలో 15మందికి రూ.27వేల 500లు, పెద్దేముల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆరుగురికి రూ.11వేలు, బషీరాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో ఐదుగురికి రూ.8వేలు మొత్తం 38మందికి గాను రూ.66వేల 500లు జరిమానా విధించినట్లు సీఐ చెప్పారు.

### పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

● ఆరుగురిపై కేసు నమోదు

బషీరాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్విచెడ్ గ్రామ శివారులో పేకాడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఈక్రమంలో దాడులు జరిపి ఆరుగురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద లభించిన రూ.25వేల నగదును స్థానిక పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. ఈ విషయమై ఎస్ఐ నుమాన్ అలీని వివరణ కోరగా పేకాటరాయుళ్లకు సంబంధించి ఫోన్లు వస్తున్నాయని వివరాలు వెల్లడిస్తామని చెప్పుకొచ్చారు.

### బస్సును అడ్డగించిన మేకల కాపరి

● అరగంట పాటు ట్రాఫిక్ జామ్

బషీరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బస్సు వెనుక టైరు తగిలి మేక గాయాలపాలైందని ఓకాపారి ఆర్టీసీ అద్దె బస్సును అడ్డుకున్నాడు. దీంతో అరగంట పాటు ట్రాఫిక్ జామ్ అయింది. ఈ ఘటన బషీరాబాద్-తాండూరు ప్రధాన మార్గం కాశీంపూర్ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కాశీంపూర్-గొట్టిగఖుర్ధు మధ్య రోడ్డు పక్కన మేకలను మేపుతుండగా ఓ మేక అటువైపుగా వస్తున్న బస్సు వెనక టైరుకు తగిలి గాయాలపాలైంది. దీంతో కాపారి బస్సును అడ్డుకుని పరిహారం చెల్లించాలని పట్టుబట్టాడు. డబ్బులు చెల్లిస్తేనే బస్సును వెళ్లనిస్తానని కాపరి డ్రైవర్, కండక్టర్‌తో గొడవకు దిగాడు. దీంతో రోడ్డుపై బస్సును నిలపగా రాకపోకలు స్తంభించి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఆర్టీసీ డ్రైవర్ ఎంతోకొంత కాపరికి ముట్టజెప్పి బస్సును అక్కడి నుంచి తీయడంతో రాకపోకలు కొనసాగాయి.

## నేటి కార్యక్రమాలు

#### పోలీసుల ఆధ్వర్యంలో రన్‌ఫర్ యునిటీ

వికారాబాద్/తాండూరు/ధారూరు/బొంరాస్‌పేట్: సర్దార్ వల్లాభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా వికారాబాద్ పట్టణంలో శుక్రవారం రన్ ఫర్ యూనిటీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఉదయం 6.40గంటలకు పార్టీలకతీతంగా జాతీయ వాదులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఎన్నెపల్లి చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ఈ ర్యాలీ కొనసాగుతుందని, యువత పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపు నిచ్చారు. అదేవిధంగా తాండూరులో ఉదయం 6,30గంటలకు విలియామూన్ చౌరస్తా నుంచి రన్ ఫర్ యునిటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. ఇందిరా చౌక్ మీదుగా అంబేడ్కర్‌చౌక్ నుంచి తిరిగి ఇందిరాచౌక్ వద్ద ముగుస్తుందని తెలిపారు. డీ ఎస్పీ బాలకృష్ణారెడ్డి పాల్గొంటారని తెలిపారు. ధారూరులో ఉదయం 8 గంటలకు ధారూరు బస్‌స్టేషన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రన్ ఫర్ యూనిటీ కొనసాగుతుందని ఎస్ఐ ఎస్. రాఘవేందర్‌చెప్పారు. అదేవిధంగా బొంరాస్‌పేట్ మండలంలోని తుంకిమెట్ల చౌరస్తా నుంచి నాందర్‌పూర్ రోడ్డు వరకు ఉదయం 7 గంటలకు నిర్వహించే 2కే రన్‌లో యువతీ, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని బొంరాస్‌పేట్ పోలీసులు గురువారం ఒక ప్రకటనలో కోరారు.

#### నేడు పౌర సేవా కేంద్రం ప్రారంభం

శామీర్‌పేట: తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన పౌర సేవాకేంద్రాన్ని శుక్రవారం(నేడు) ఉదయం 9గంటలకు ప్రారంభిస్తున్నట్లు కమిషనర్ జ్యోతి గురువారం మీడియాకు తెలిపారు. తూంకుంట మున్సిపల్ స్పెషలాఫీసర్, సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ సంధ్య విచ్చేసి పౌర సేవా కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు కమిషనర్ వివరించారు.

#### నేడు మహిబూబ్‌సుభానీ గంధోత్సవం

కొడంగల్: కొడంగల్‌లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల అనంతరం మహిబూబ్‌సుభానీ గంధోత్సవం నిర్వహించనన్నట్లు మైనారిటీ నాయకుడు ఎస్ఎం.గౌసన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక జామే మస్జీద్ నుంచి ర్యాలీగా పోలీస్‌స్టేషన్ సమీపంలోని దర్గా వరకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ప్రభుత్వాసుపత్రిలో క్యాన్సర్ పరీక్షలు

దోమ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీలో గురువారం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ అసోసియేషన్, రాష్ట్ర కమిషనర్ ఫ్యామిలీ వెల్ఫేర్ పిలుపు మేరకు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. వైద్యులు నిరోషా, అఖిల్, సాయితేజ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## శబరిమలకు పాదయాత్ర


ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో అయ్యప్పస్వాములు

శామీర్‌పేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లకు చెందిన దాదాపు 40మంది అయ్యప్పమాలధారులు ఈనెల 26న శబరిమలకు పాదయాత్రగా బయల్దేరి గురువారం శామీర్‌పేట ఎల్లమ్మ ఆలయం వరకు చేరుకున్నారు. మధ్యాహ్నం వరకు విశ్రాంతి తీసుకుని అనంతరం పాదయాత్ర కొనసాగించారు.